
సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
# SK1 one NEWS HD — సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
జాతీయ తెలుగు దినపత్రిక
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT
ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 184 | పేజీలు : 04, వెల రూ. 2 రూ/ | బుధవారం 23-09-2026

### హైదరాబాద్‌ను
## ముంచెత్తిన వర్షం



- అధికారులను అప్రమత్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం
- వాయుగుండం ప్రభావంతో తెలంగాణకు రెండు రోజుల వర్ష సూచన
- ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 20 జిల్లాలకు భారీ వర్ష హెచ్చరిక

**హైదరాబాద్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రానున్న రెండు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా - మిగతా 2 లో



### జూరాలకు నీళ్లివ్వండి కర్ణాటక
## సీఎంకు రేవంత్ ఫోన్

- జూరాలకు 5 టీఎంసీల నీరు ఇవ్వాలని కోరిన రేవంత్
- నీటి విడుదలకు శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం
- బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ
- విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి

**హైదరాబాద్ :** ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టీఎంసీల - మిగతా 2 లో

### దళితులు, ఆదివాసీ, గిరిజనుల
## అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- దళితులు, ఆదివాసీ, గిరిజనుల కోసం ప్రభుత్వంచిత్తశుద్ధితో పని చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు
- ఎస్సీ, ఎస్టీలపై జరిగే దాడులు, అత్యాచారాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది
- ఎస్టీలకు 17 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని గుర్తు చేశారు
- ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం దళితులకు కేటాయిస్తున్నట్లు రేవంత్ వెల్లడి
- విద్యా వికాసమే పేదరికాన్ని నిర్మూలిస్తుందని వ్యాఖ్య



**హైదరాబాద్ :** దళితులు, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం రేవంత్ రెడ్డి దళితులు, ఆదివాసీ, గిరిజనుల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం లబ్ధిదారులు దళితులేనని అన్నారు. ఎస్టీలకు 17 శాతం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని గుర్తు చేశారు. అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సన్నబియ్యంతో దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందిస్తున్నామని, అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. అత్యాచార బాధితులకు పరిహారాన్ని గ్రీన్‌ఛానల్ ద్వారా విడుదల చేయిస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలను చదువు, క్రీడలవైపు ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సొంత తల్లిలా ప్రేమ చూపించిన - మిగతా 2 లో



### నేను జగన్‌ను
## కలిసేది అప్పుడే

- (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- కూతురి పెళ్లిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేసే ఖర్మ తనకు లేదంటూ ఘాటు వ్యాఖ్య
- సోషల్ మీడియాలో తనపై జరుగుతున్నది దుష్ప్రచారమేనన్న ఏపీసీసీ చీఫ్
- సోదరుడు జగన్‌ను కలిసేది కుమార్తె వివాహానికి ఆహ్వానించడానికేనని స్పష్టీకరణ
- ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తొలి వివాహ పత్రిక ఉంచి నివాళులు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోదరుడు, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో తాను రహస్యంగా సమావేశం అవుతున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమని, అవి కేవలం కట్టుకథలని కొట్టిపారేశారు. తన కుమార్తె వివాహాన్ని అడ్డుపెట్టుకుని తెర వెనుక రాజకీయాలు చేసుకునే - మిగతా 2 లో

## కూటమి మరింత బలంగా ఉండాలి

- ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- అధికారంలోకి వచ్చాక నాయకుల్లో వేడి తగ్గింది
- కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండోరోజు పర్యటించారు
- పిఠాపురంలో రూ.1,500 కోట్లతో అభివృద్ధి పనులకు పవన్ శ్రీకారం చుట్టారు
- కొత్తగా నిర్మించిన రథశాల, యాగశాల, కాలక్షేప మండపం, అన్నదాన హాలు పనులను పరిశీలించిన పవన్
- సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం



**అమరావతి :** కాకినాడ జిల్లా పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రెండోరోజు పర్యటించారు. ఇందులో భాగంగా రూ.1500 కోట్లతో పలు అభివృద్ధి పనులను ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మంగళవారం ఉదయాన్నే పవన్ తన పర్యటనను ప్రారంభించారు. తొలుత గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీసీతారామ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు పథకాల లబ్ధిదారులకు సంబంధిత పత్రాలను అందజేశారు. ఆ తర్వాత ఆర్ఆర్‌బీహెచ్ఆర్ మైదానంలో నిర్వహించిన 'పిఠాపురం నిండుగా.. అభివృద్ధి పండుగ' బహిరంగ సభలో పవన్ పాల్గొన్నారు. 30 మంది మత్స్యకారులకు రక్షణ పరికరాలు అందించారు. నివాస గృహాల క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు పంపిణీ చేశారు. పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, విద్యార్థులకు బ్యాగులు ఇచ్చారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కులు అందించారు. రైతు సంఘం నాయకులు పవన్ కల్యాణ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపి, నాగలిని బహుమతిగా అందజేశారు. అనంతరం బహిరంగ సభలో పవన్ మాట్లాడారు. ఉప్పాడ తీరంలో సముద్రపు కోత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. 323 కోట్ల రూపాయలతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. అమృత్ భారత్ స్కీమ్ కింద 35 కోట్లతో పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. - మిగతా 2 లో

### ఏపీ పట్టణాలకు
## కొత్త కళ




- రాష్ట్రవ్యాప్తంగా రూ.11,359 కోట్ల పట్టణ అభివృద్ధి పనులకు శ్రీకారం
- హెచ్ఏఎం పద్ధతిలో తొలిసారిగా 123 మున్సిపాలిటీల్లో పనుల ప్రారంభం
- కుప్పం నుంచి లాంఛనంగా పనులను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కుల నిర్మాణం లక్ష్యం
- శాంతిపురం వద్ద హంద్రీనీవా కాలువకు జలహారతి ఇవ్వనున్న ముఖ్యమంత్రి



### అక్టోబర్ 16న
## రాజ్యసభ ఎన్నికలు

- మూడు రాష్ట్రాల్లో ఆ 12 స్థానాలకు పోలింగ్
- సెప్టెంబర్ 29న నోటిఫికేషన్- అక్టోబర్ 6వరకు నామినేషన్ల దాఖలు
- పోలింగ్ రోజునే ఓట్ల లెక్కింపు
- యూపీలో బీజేపీ కూటమికి 8, ఎస్పీకి 2 స్థానాలు దక్కే అవకాశం

**ఢిల్లీ :** ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, బంగాల్ రాష్ట్రాల్లో మొత్తం 12 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో 10 రాజ్యసభ స్థానాలు, ఉత్తరాఖండ్‌లో ఒకటి, బంగాల్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. అక్టోబర్ 16న పోలింగ్‌తో - మిగతా 2 లో

## జూరాల కోసం బెంగళూరుకు తెలంగాణ మంత్రులు




- జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలపై కర్ణాటకతో చర్చలు
- బెంగళూరుకు తెలంగాణ మంత్రుల బృందం
- కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో సమావేశం కానున్న మంత్రులు
- ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి నీరు కోరనున్న తెలంగాణ
- సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం మంత్రుల పయనం

## స్థానిక ఎన్నికల్లో 94 శాతానికి పైగా గెలవాలి

- టీడీపీ శ్రేణులకు మంత్రి లోకేశ్ టార్గెట్
- ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని సూచన
- టీడీపీకి కోటి ఆరు లక్షల మంది సభ్యులున్నారని వెల్లడి
- జనసేన, బీజేపీతో కలిసి ముందుకు సాగాలని సూచన
- కూటమిలో సమస్యలను చర్చలతో పరిష్కరించుకోవాలని పిలుపు
- కష్టపడే కార్యకర్తలను గుర్తించి గౌరవిస్తామన్న లోకేశ్




### టెక్సాస్‌లో 90 అడుగుల
## హనుమాన్ విగ్రహం

- అమెరికాలో రాజకీయ దుమారం
- కూల్చేస్తామంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలతో రాజుకున్న దుమారం
- ఇది హిందూ మతంపై దాడి అంటూ అమెరికాలోని హిందూ సంఘాల ఆగ్రహం
- అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ మతపరమైన చర్చకు దారితీసిన ఘటన
- విగ్రహం ప్రైవేట్ ఆస్తిలో ఉందని, ఐక్యతకు చిహ్నమని ఆలయ వర్గాల వెల్లడి




### ఆర్థిక వృద్ధిలో
## భారత్ జోరు

- వచ్చే ఏడాదిపై వరల్డ్ ఎకనామిక్ ఫోరం కీలక అంచనా
- ఎఫ్‌వై27లో భారత్ జీడీపీ వృద్ధి అంచనా 6.7 శాతం
- 74 శాతం మంది ఎకనామిస్టులు బలమైన వృద్ధిని అంచనా
- ఐదు శాతానికి తగ్గిన ఆగస్టు నిరుద్యోగిత రేటు




**ఢిల్లీ :** భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి మరో సానుకూల అంచనా వెలువడింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత్ జీడీపీ వృద్ధి 6.7 శాతంగా ఉండొచ్చని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) చీఫ్ ఎకనామిస్ట్స్ ఔట్‌లుక్ నివేదిక తెలిపింది. దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం వృద్ధికి ప్రధాన కారణంగా పేర్కొంది. సెప్టెంబర్ 2026 నివేదిక కోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన 92 మంది చీఫ్ - మిగతా 2 లో

# సంపాదకీయం

## అసలు నకిలీ

మార్లిన్ మన్రో అంటే దాదాపుగా హాలీవుడ్ దేవత. జాన్ స్టెయిన్‌బెక్ ఏమో నోబెల్ గౌరవానికి నోచుకున్న నవలా రచయిత. సహజంగానే రచయితలకంటే నటీమణులకే క్రేజ్ ఎక్కువన్నది ఏ ప్రాంతానికైనా వర్తించే సత్యం కాబట్టి, అమెరికా కూడా అందుకు మినహాయింపు కాదు. స్టెయిన్‌బెక్ భార్య తరఫు మేనల్లుడైన ఓ 17 ఏళ్ల కుర్రాడు మార్లిన్ 'బానిస'. అలాంటివాడికి మార్లిన్‌ను స్టెయిన్‌బెక్ కలిశాడనే 'ఘోరమైనతప్పిదం' మేనత్త చేసిందట. ఆ కుర్రాడు దాన్ని నమ్మకపోయినా మామగారి పట్ల అతడి 'మర్యాద' ఆకాశాన్నంటింది. ఇక తప్పదన్నట్టుగా, ఆటోగ్రాఫ్ చేసిన ఒక ఫొటోను పంపమంటూ 1955లో న్యూయార్క్ నుంచి మార్లిన్‌కు ఓ లేఖ రాశాడు స్టెయిన్‌బెక్. భాష, శైలి, చమత్కారం వల్ల పదేపదే వైరల్ అయ్యే ఈ లేఖను ఈమధ్యే ప్యాట్రిక్ ఓషానెసీ అనే వ్యాపారవేత్త 'ఎక్స్'లో పంచుకున్నాడు. దీన్నే శశి థరూర్ ఓ నాలుగేళ్ల కింద షేర్ చేశాడు. అయితే, ఇందులోని శైలి స్టెయిన్‌బెక్‌దే అయినా, నిజంగా ఆయనే రాశాడనేందుకు ఆధారాలు లేవనే సందేహాలూ ఉన్నాయి. స్టెయిన్‌బెక్‌ది కాకపోతే స్టెయిన్‌బెక్ అంతటివాడు ఆవహించి రాసినదై ఉండాలి.చరిత్రలో కొన్ని అబద్ధాలు ఎంత అందంగా ఉంటాయంటే అవి నిజమైతే బాగుండనిపిస్తుంది. ఒక మహానుభావుడి చేతిరాత కనిపిస్తే, ఒక నియంత రహస్య డైరీ దొరికితే, ఒక గొప్ప కవి ప్రేమలేఖ చేతికి చిక్కితే-- అవి నిజం కాదనే అనుమానమే అన్యాయంగా తోస్తుంది. అందుకే చరిత్రలోని కొన్ని మోసాలు కేవలం మోసాలుగా మిగిలిపోలేదు. సాహిత్యాన్నీ, జర్నలిజాన్నీ, పరిశోధననూ, మనుషుల ఊహాశక్తినీ పరీక్షించిన అద్భుతమైన కథనాలుగా మిగిలిపోయాయి. 1983లో జర్మన్ పత్రిక స్టెర్న్ 1932 నుంచి 1945 వరకు అడాల్ఫ్ హిట్లర్ రాసినట్లుగా చెప్పిన దాదాపు అరవై సంపుటాల డైరీలు దొరికాయని ప్రకటించింది. యుద్ధం చివరి దశలో హిట్లర్ వ్యక్తిగత వస్తువులను తరలిస్తున్న విమానం కూలిపోవడంతో ఆ డైరీలు బయటపడ్డాయని కథనం. కానీ ఫోరెన్సిక్ పరీక్షలు కాగితం, సిరా రెండో ప్రపంచ యుద్ధం తర్వాతివని తేల్చాయి. కోన్రాడ్ కుజావు అనే చిత్రకారుడి సృజనాత్మక మోసం అలా బయటపడింది.ముందు వాటిని అసలువని ఎందుకు నమ్మారు? అవి నిజమైతే బాగుండనే భావన మనుషులను అమాయకులను చేయడంవల్ల. ఇదే బలహీనత అబ్రహాం లింకన్ ప్రేమలేఖల ఉదంతంలోనూ కనబడుతుంది. 1928లో అమెరికా పత్రిక అట్లాంటిక్ మంత్లీలో 'లింకన్ ద లవర్' పేరుతో ఆన్ రట్లెడ్జ్‌కు లింకన్ రాసినట్టుగా చెప్పిన లేఖలు ప్రచురితమయ్యాయి. కానీ వాటి భాష, శైలి, ఆ కాలపు పదప్రయోగాలు అనుమానాస్పదంగా తోచాక రచయిత్రి విల్మా ఫ్రాన్సిస్ మైనర్ చేసిన సాహిత్య మోసం బయటపడింది. ఇక 18వ శతాబ్దం చివర్లో లండన్‌లో విలియం హెన్రీ ఐర్లాండ్ అనే కవి ఏకంగా షేక్స్పియర్ స్వహస్తాలతో రాసిన లేఖలు, అన్నే హాత్‌వేకి రాసిన ప్రేమలేఖలు, కింగ్ లియర్, హామ్లెట్ వంటి రచనల చేతిరాత ప్రతులతోపాటు షేక్స్పియర్ సరికొత్త నాటకం 'వాటిగెర్న్ అండ్ రొవెనా'ను 'కనుగొన్నాడు'. ఇంత కష్టపడి ఎందుకు నకిలీవి సృష్టిస్తారంటే దానికున్న మార్కెట్, సంచలన యావ, సరదా. అంతెందుకు, సాంస్కృతిక వారసత్వపు వెన్నువిరవకుండా భారతదేశాన్ని జయించలేమని ప్రచారంలో ఉన్న 1835 ఫిబ్రవరి 2 నాటి లార్డ్ మెకాలే ప్రసంగం కూడా ఉత్తిదేనని కథనాలు వెలువడ్డాయి. భావజాల పరంగా మెకాలే అలాంటివాడే కావొచ్చుగానీ ఆ లేఖ మీద మాత్రం వివాదం లేకుండా లేదు.ఇప్పుడు ఇదంతా ఎందుకంటే, స్టీఫెన్ థేలర్ అనే ఏఐ పరిశోధకుడు 'ఎ రీసెంట్ ఎంట్రన్స్ టు ప్యారడైజ్' అనే చిత్రాన్ని డాబుస్ ఏఐ టూల్‌తో గీయించి, ఆ చిత్ర సృష్టికర్తగా దాన్నే అంగీకరించాలని పెట్టుకున్న కాపీరైటు అర్జీని భారత ప్రభుత్వ కాపీరైట్ కార్యాలయం ఇటీవలే కొట్టేసింది. దాన్ని ఒరిజినల్ వర్క్‌గా అంగీకరిస్తూనే, మానవ ప్రమేయం లేని ఈ కళకు కాపీరైట్ ఇవ్వడానికి తిరస్కరించింది. తనను సృష్టికర్తగా చెప్పుకోవడానికి థేలర్ అంగీకరించలేదు. కృత్రిమ నకిలీల కాలంలో ఆ మేరకు ఆయన సహజ అభినందనకు అర్హుడు.

# కూటమి మరింత బలంగా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి -**

మరో నాలుగు నెలల్లో తన క్యాంపు కార్యాలయాన్ని పిఠాపురానికి మార్చనున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. 'పిఠాపురం నిండుగా.. అభివృద్ధి పండుగ' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బహిరంగసభ వేదికగా జనసేన నేతలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి వచ్చాక నాయకుల్లో వేడి తగ్గిందంటూ చురకలు అంటించారు. అదే సమయంలో కూటమి మరింత బలంగా ఉండాలని ఆకాంక్షించారు. నాయకుల ఆకాంక్షల కన్నా ప్రజల అవసరాలకు ముందు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.'పిఠాపురంలో శాశ్వత డంపింగ్ యార్డుకు పరిష్కారం చూపాం. రోజుకు 72 లక్షల లీటర్ల సామ ర్థ్యంతో 2 ఎస్పీటీల నిర్మాణం చేపట్టాం. రూ.225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తున్నాం. రూ.34 కోట్లతో ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ పనులు ప్రారంభించాం. రూ.2 కోట్లతో కుంతీ మాధవస్వామి ఆలయ కోనేరును పునరుద్ధరించాం. మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలను ఏర్పాటు చేస్తున్నాం. 40 టన్నుల తడి చెత్తను శుభ్రం చేసే ప్లాంట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్న ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్.సభలో పాల్గొనడానికి ముందే ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురం నియోజ కవర్గంలో 9 కోట్ల 59 లక్షల రూపాయలతో ఆధునీకరించిన నాగు లపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్నిప్రారంభించారు. యూ. కొత్తపల్లి మండలంలోని సమగ్ర మంచినీటి సరఫరా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. పథకం వివరాలను అధికారు లు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. పిఠాపురం నియోజక వర్గం లోని పలు గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చేలా ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. పిఠాపురం రూరల్ మండలాల పరిధిలోని సుమారు 52 ఆవాసాల్లో 97 వేల మందికి పూర్తి స్థాయిలో తాగునీరు అందించేలా పథకాన్ని ఆధునీకరించారు. మార్గమ ధ్యంలో కొండేవారంలో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్‌ను కూడా ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ చీఫ్ గాయత్రి దేవి, చీఫ్ ఇంజినీర్ హరి రామ్ నాయక్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్నారు. ఏకాదశి వ్రతాచరణలో భాగంగా ఉదయం స్వామివారి ప్రాతఃకాల సేవలో పాల్గొన్నారు. రాములవారికి అష్టోత్తరాలతో పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన పవన్‌కి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో చేబ్రోలు శ్రీ సీతారామస్వామి వారి ఆలయం సమీపంలో సభ నిర్వహించిన విషయం తెలిసిందే. మరోసారి స్వామివారిని దర్శించుకోవడం ప్రాధా న్యత సంతరించుకుంది. విజయం అనం తరం ఆలయ అభివృద్ధికి రెండు విడతలుగా దాదాపు రూ.90 లక్షల నిధు లు మంజూరు చేయి ంచారు. ఆ నిధులతో ఆలయంలో కాలక్షేప మండపం, రథశాల, అన్నదానం కోసం హాలు, యాగశాల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

## ఏపీ పట్టణాలకు కొత్త కళ

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పట్టణాల రూపురేఖలను సమూలంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ఒక బృహత్తర కార్యక్రమానికి నేడు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానంలో రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని 106 నియోజకవర్గాల పరిధిలో ఉన్న 123 మున్సిపాలిటీల్లో ఏకకాలంలో పనులు మొదలు కానున్నాయి. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.7,469 కోట్లు, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో ప్రత్యేకంగా రూ.3,890 కోట్ల విలువైన పనులను చేపట్టనున్నారు. ఈ నిధులతో ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా రోడ్ల నిర్మాణానికి రూ.4,656 కోట్లు, సెంట్రల్ మీడియన్ల ఏర్పాటుకు రూ.88 కోట్లు, కొత్త స్ట్రీట్ లైటింగ్ కోసం రూ.247 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.509 కోట్లు కేటాయించారు. ఈ కార్యక్రమం పూర్తయితే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల మేర స్ట్రీట్ లైటింగ్, 300 కిలోమీటర్ల సీవరేజ్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి వస్తాయి.పట్టణ స్థానిక సంస్థలపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పనులను హెచ్ఏఎం పద్ధతిలో అమలు చేస్తోంది. ఈ విధానంలో కాంట్రాక్టర్లు తమ సొంత నిధులతో పనులు పూర్తిచేయగా, ప్రభుత్వం వారికి వార్షిక వాయిదాల రూపంలో చెల్లింపులు చేస్తుంది. కుప్పంలో పనులు ప్రారంభించిన తర్వాత సీఎం చంద్రబాబు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలు, మునిసిపల్ శాఖ అధికారులతో మాట్లాడి దిశానిర్దేశం చేయనున్నారు.ఈ పర్యటనలో భాగంగా శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద హంద్రీనీవా కాలువను సందర్శించి కృష్ణా జలాలకు సీఎం జలహారతి ఇవ్వనున్నారు. అనంతరం ఈసీ పౌల్ట్రీ షెడ్ కార్యక్రమం కింద ఎంపికైన కొందరు లబ్ధిదారులతో ముచ్చటించి, మధ్యాహ్నం పార్టీ కేడర్‌తో జరిగే సమావేశంలో పాల్గొననున్నారు.

## నేను జగన్‌ను కలిసేది అప్పుడే

**మొదటిపేజీ తరువాయి -** ఖర్మ వైఎస్సార్ బిడ్డగా తనకు లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. కొద్దిరోజులుగా తాను జగన్‌ను కలవబోతున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు షర్మిల తెలిపారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహానికి ఆహ్వానించేందుకు వెళ్లినప్పుడే తాను చివరిసారిగా జగన్‌ను కలిశానని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ కలిస్తే, అది కేవలం తన కుమార్తె అంజిలి రెడ్డి వివాహ మహోత్సవానికి ఆహ్వాన పత్రికను అందించడానికి మాత్రమేనని స్పష్టం చేశారు. అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానించినట్లే జగన్‌ను కూడా పిలుస్తానని, ఇందులో వింతేమీ లేదని అన్నారు."నేను ఎవరినో కలిసినట్లు, ఎక్కడో చేరిపోతున్నట్లు సోషల్ మీడియాలో అల్లుతున్నవి కట్టుకథలు మాత్రమే. ఈ విశ్లేషణలు పూర్తిగా నిరాధారం. శుభకార్యానికి, రాజకీయానికి ముడిపెట్టి నా విశ్వసనీయతను దెబ్బతీయాలని చూస్తే ఊరుకునేది లేదు" అని షర్మిల హెచ్చరించారు.

వివాహ వేడుకల వివరాలు

ఈ సందర్భంగా షర్మిల తన కుమార్తె వివాహ వేడుకల వివరాలను అధికారికంగా ప్రకటించారు. తన కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డిల నిశ్చితార్థం ఈ నెల 24న, వివాహం నవంబర్ 25న, రిసెప్షన్ డిసెంబర్ 5న జరుగుతాయని వెల్లడించారు. ఈ శుభవార్తను తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఘాట్ వద్ద పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు.కుటుంబ సభ్యులు, కాబోయే వియ్యంకుల సమక్షంలో ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తొలి వివాహ పత్రికను ఉంచి, ఆయన ఆశీస్సులు తీసుకున్నట్లు తెలిపారు. తన తండ్రి దీవెనలు బిడ్డల జీవితాలకు కొండంత అండ అని షర్మిల పేర్కొన్నారు. కాబోయే నవదంపతులను తెలుగు ప్రజలందరూ హృదయపూర్వకంగా ఆశీర్వదించాలని ఆమె కోరారు.

## స్థానిక ఎన్నికల్లో 94 శాతానికి పైగా గెలవాలి

**మొదటిపేజీ తరువాయి -** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతానికి పైగా స్థానాలను కైవసం చేసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటినుంచే కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో లోకేశ్ మాట్లాడారు.టీడీపీకి కోటి ఆరు లక్షల మంది సభ్యులు ఉన్నారని లోకేశ్ తెలిపారు. ఇప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా తమ కుటుంబంలో భాగమయ్యారని, బీజేపీ కూడా కూటమిలో కలిసి పనిచేస్తోందని చెప్పారు. మూడు పార్టీలు కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకెళ్తున్నాయని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని లోకేశ్ సూచించారు. "ఎన్నికలు.. తగ్గేదేలే" అంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించి గౌరవిస్తామని చెప్పారు. ప్రజల్లో ఉంటూ వారికి సేవ చేయాలని సూచించారు.కూటమిలో ఏవైనా సమస్యలు ఉంటే నాలుగు గోడల మధ్య కూర్చొని చర్చించుకుని పరిష్కరించుకోవాలని లోకేశ్ అన్నారు. ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ దానికి కట్టుబడి ఉండాలని సూచించారు. మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగితే రాష్ట్ర అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని చెప్పారు.గతంలో పార్టీ కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేసుకున్న లోకేశ్.. వారి కష్టాన్ని ప్రజా సేవ ద్వారా గౌరవించాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతానికి మించి స్థానాలు సాధించేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు.

## ఆర్థిక వృద్ధిలో భారత్ జోరు




**మొదటిపేజీ తరువాయి -** ఎకనామిస్టుల అభిప్రాయాలను సేకరించారు. వీరిలో 74 శాతం మంది భారత్‌లో ఆర్థిక వృద్ధి బలంగా లేదా చాలా బలంగా ఉంటుందని అంచనా వేశారు. మే నెలలో ఈ అభిప్రాయం 52 శాతంగా ఉంది. వచ్చే 12 నెలల్లో భారత్ వృద్ధి మోస్తరుగా లేదా అంతకంటే మెరుగ్గా ఉంటుందని 98 శాతం మంది భావించారు.ఉద్యోగాల విషయానికొస్తే.. వచ్చే 12 నెలల్లో నిరుద్యోగితలో మార్పు ఉండదని 70 శాతం మంది అంచనా వేశారు. ఆగస్టులో 15 ఏళ్లు పైబడిన వారి నిరుద్యోగిత రేటు 5 శాతానికి తగ్గింది. జులైలో ఇది 5.1 శాతంగా ఉంది. ఇదే సమయంలో లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు 55.4 శాతం నుంచి 55.6 శాతానికి పెరిగింది.ద్రవ్యోల్బణంపై కూడా అంచనాలు కొంత మెరుగయ్యాయి. వచ్చే ఏడాది భారత్‌లో ద్రవ్యోల్బణం మోస్తరు స్థాయిలో ఉంటుందని 55 శాతం మంది ఎకనామిస్టులు భావించారు. 45 శాతం మంది మాత్రం అధికంగా ఉంటుందని అంచనా వేశారు. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.8 శాతానికి చేరింది. ఇది ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతానికి మించి ఉంది. అయితే 2-6 శాతం పరిమితిలోనే కొనసాగుతోంది.ద్రవ్య విధానంలో మార్పు ఉండదని 67 శాతం మంది అంచనా వేశారు. ఆగస్టులో పాలసీ రేటును 5.25 శాతం వద్దే కొనసాగించారు. ఈ నివేదిక సర్వే ఆగస్టు 20న పూర్తయింది. ఆ తర్వాత ఆగస్టు 31న విడుదలైన గణాంకాల్లో 2026-27 తొలి త్రైమాసికంలో భారత్ జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. దీంతో పలు సంస్థలు తమ వృద్ధి అంచనాలను పెంచుతున్నాయి. మూడీస్ కూడా తన అంచనాను 6 శాతం నుంచి 7 శాతానికి పెంచింది.

## జూరాల కోసం బెంగళూరుకు తెలంగాణ మంత్రులు

**మొదటిపేజీ తరువాయి -** జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని కోరేందుకు మంగళవారం బెంగళూరుకు తెలంగాణ మంత్రుల బృందం బయలుదేరింది. కృష్ణా బేసిన్‌లో నెలకొన్న నీటి కొరత నేపథ్యంలో, పొరుగు రాష్ట్రమైన కర్ణాటకతో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.ఈ పర్యటనలో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశం కానుంది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల నుంచి జూరాల ప్రాజెక్టుకు సాగునీటిని విడుదల చేయాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేయనున్నారు.అంతకుముందు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. జూరాల ప్రాజెక్టు నీటి అవసరాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చల అనంతరం, కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు మంత్రుల బృందం నేడు సాయంత్రం బెంగళూరుకు పయనం కానుంది. ఇరు రాష్ట్రాల మధ్య జరిగే ఈ ద్వైపాక్షిక చర్చల ద్వారా జూరాల ఆయకట్టు రైతులకు తగిన ఊరట లభిస్తుందని తెలంగాణ ప్రభుత్వం ఆశిస్తోంది.

## హైదరాబాద్‌ను ముంచెత్తిన వర్షం

**మొదటిపేజీ తరువాయి -** భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, మల్కాజిగిరి, బోయిన్‌పల్లి, అంబర్‌పేట, కోఠి, లక్డీకాపూల్ వంటి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై వర్షపు నీరు భారీగా చేరడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ముఖ్యంగా షేక్‌పేట పరిసర ప్రాంతాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.వాయుగుండం ప్రభావంతో మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం సహా ఎనిమిది జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేయగా, మరో 20 జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేసింది.భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. సహాయక బృందాలు, కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## దళితులు, ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి -** ఇందిరమ్మను ఇప్పటికీ మరిచిపోలేదని, 25 లక్షల ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అందించిన ఘనత ఇందిరాగాంధీదని కొనియాడారు. ఇందిరా గాంధీ స్ఫూర్తితోనే ఈ ప్రభుత్వం పనిచేస్తుందని, బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయిస్తున్నామని, ప్రభుత్వం ఈ వర్గాల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని, రాష్ట్రంలో 3 కోట్ల 48 లక్షల మందికి తెలంగాణలో సన్న బియ్యం అందిస్తున్నామని, సన్న బియ్యంతో దళిత, గిరిజన వర్గాలకు మంచి భోజనం అందించగలు గుతున్నామని రేవంత్ రెడ్డి



వెల్లడించారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలను దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, అత్యాచార ఘటనలపై ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందిస్తోందని, బాధితుల నష్టపరిహారాన్ని బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్‌లో విడుదల చేయాలని అధికారులను ఆదేశిస్తున్నానని వెల్లడించారు. చదువొక్కటే జీవితాలను మారుస్తుందని, అట్టడుగు వర్గాలను చదువు వైపు నడిపించకపోతే సమస్య పరిష్కారం కాదని, పిల్లల్ని చదువు వైపు, క్రీడలవైపు ప్రోత్సహించాలని సీఎం కోరారు. రాజకీయాలకి అతీతంగా ఈ వర్గాల అభివృద్ధి చేసుకుందమని, ఈ ప్రభుత్వం మీది మీ కోసం పని చేస్తుందని స్పష్టం చేశారు.

## అక్టోబర్ 16న రాజ్యసభ ఎన్నికలు

**మొదటిపేజీ తరువాయి -** పాటు ఓట్ల లెక్కింపు కూడా చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్ 29న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 వరకు గడువు ఉంటుంది. అనంతరం ఎన్నికల ప్రక్రియ కొనసాగి అక్టోబర్ 16న పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు ఓట్ల లెక్కింపు కూడా జరుగుతుంది. ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుత రాజ్యసభ సభ్యుల పదవీకాలం నవంబర్ 25తో ముగియనుంది. దీంతో ఆ రాష్ట్రంలోని 10 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్న ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరుగుతుండటంతో రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఉత్తర్‌ప్రదేశ్ నుంచి పదవీకాలం ముగుస్తున్న రాజ్యసభ సభ్యుల్లో బీజేపీకి చెందిన అరుణ్ సింగ్, గీతా శాక్య, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, బి.ఎల్. వర్మ, సీమా ద్వివేది, హర్దీప్ సింగ్ పూరీ ఉన్నారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్ గోపాల్ యాదవ్, బీఎస్పీకి చెందిన రామ్‌జీ గౌతమ్ కూడా పదవీకాలం ముగించుకోనున్నారు. ఇదే సమయంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి దినేశ్ శర్మ రాజీనామాతో ఒక రాజ్యసభ స్థానం సెప్టెంబర్ 11 నుంచి ఖాళీగా ఉంది. అండమాన్ అండ్ నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులైన తర్వాత దినేశ్ శర్మ రాజీనామా చేశారు.ప్రస్తుత ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ బలాబలాలను పరిశీలిస్తే, బీజేపీ నేతృత్వంలోని కూటమికి 10 ఖాళీ స్థానాల్లో ఎనిమిది దక్కే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖాళీ అవుతున్న 10 స్థానాల్లో ఎనిమిదింటిని బీజేపీ, ఒకదాన్ని సమాజ్‌వాదీ పార్టీ, మరో స్థానాన్ని బీఎస్పీ కలిగి ఉన్నాయి. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత రాజ్యసభలో బీఎస్పీకి ప్రాతినిధ్యం లేకుండా పోయే అవకాశం ఉంది. ప్రస్తుత బలాబలాల ప్రకారం రామ్‌జీ గౌతమ్ స్థానాన్ని తిరిగి గెలుచుకునేందుకు అవసరమైన సంఖ్యాబలం బీఎస్పీకి లేదు.ఆగస్టులో బీఎస్పీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే ఉమా శంకర్ సింగ్ మరణించారు. దీంతో ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం బీఎస్పీకి ఎమ్మెల్యేలు ఎవరూ లేరు. ఈ పరిస్థితుల్లో ఆ పార్టీకి రాజ్యసభ సభ్యుడిని సొంతంగా ఎన్నుకునే అవకాశం లేకుండా పోయింది. 2020లోనూ బీఎస్పీకి సొంతంగా రాజ్యసభ సభ్యుడిని ఎన్నుకునేంత సంఖ్యాబలం లేదు. అయితే అప్పట్లో 10 రాజ్యసభ స్థానాలకు బీజేపీ కేవలం ఎనిమిది మంది అభ్యర్థులను మాత్రమే బరిలోకి దించింది. దీంతో బీఎస్పీ అభ్యర్థి రామ్‌జీ గౌతమ్‌కు అవకాశం లభించింది.ఆ ఎన్నికలో సమాజ్‌వాదీ పార్టీ మద్దతు ఉన్న స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో రామ్‌జీ గౌతమ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ పరిణామంతో బీజేపీ, బీఎస్పీ మధ్య అవగాహన జరిగిందని సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది. ఉత్తరాఖండ్‌లో ఒక రాజ్యసభ స్థానానికి ఎన్నిక జరగనుంది. బీజేపీ సభ్యుడు నరేశ్ బన్సాల్ పదవీకాలం నవంబర్ 25తో ముగిస్తుండడంతో ఆ స్థానం ఖాళీ కానుంది. ప్రస్తుత అసెంబ్లీ బలాబలాల ప్రకారం ఆ స్థానాన్ని బీజేపీ నిలబెట్టుకునే అనుకూల పరిస్థితిలో ఉన్నట్లు పేర్కొంటున్నారు. అలాగే బంగాల్‌లో ఒక రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక జరగనుంది. జులై 16న రుక్మిణీ మల్లిక్ రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికలో గెలిచే అభ్యర్థి ప్రస్తుతం మిగిలి ఉన్న పదవీకాలాన్ని పూర్తి చేయనున్నారు. ఈ పదవీకాలం 2032 ఏప్రిల్ 2 వరకు ఉంటుంది.

## టెక్సాస్‌లో 90 అడుగుల హనుమాన్ విగ్రహం

**మొదటిపేజీ తరువాయి -** అమెరికాలోని టెక్సాస్‌లో ప్రతిష్ఠించిన 90 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ఇప్పుడు రాజకీయ, మతపరమైన వివాదానికి కేంద్రంగా మారింది. ఈ విగ్రహాన్ని కూల్చేస్తామంటూ ఓ కన్జర్వేటివ్ యూట్యూబర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఇది హిందూ మతంపై జరిగిన దాడిగా అక్కడి హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.వివరాల్లోకి వెళితే.. టెక్సాస్‌లోని షుగర్ ల్యాండ్‌లో ఉన్న శ్రీ అష్టలక్ష్మి ఆలయ ప్రాంగణంలో ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై కన్జర్వేటివ్ యూట్యూబర్ జెస్సీ హ్యూస్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "మేము గెలిచినప్పుడు ఈ విగ్రహాన్ని కూల్చేస్తాం" అని పోస్ట్ చేశారు. ఈ వ్యాఖ్య తీవ్ర దుమారం రేపడంతో పాటు అమెరికాలోని హిందూ సమాజం నుంచి బలమైన ప్రతిస్పందన వచ్చింది.జెస్సీ వ్యాఖ్యలపై అమెరికా సైన్యంలో పనిచేసిన రుచిర్ బక్షీ తీవ్రంగా స్పందించారు. ఇది హిందూ మతంపై జరిగిన దాడి అని, దేశభక్తి లేని చర్య అని ఆయన మండిపడ్డారు. కోయలిషన్ ఆఫ్ హిందూస్ ఆఫ్ నార్త్ అమెరికా (జశీఎచీూ) వంటి సంస్థలతో పాటు ఇతర సైనికోద్యోగులు కూడా హిందూ సమాజానికి మద్దతుగా నిలిచారు. తమ ప్రార్థనా స్థలాలను కాపాడుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని స్పష్టం చేశారు.ఈ ఏడాది 2024 ఆగస్టులో 'స్టాట్యూ ఆఫ్ యూనియన్' పేరుతో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇది అమెరికాలోనే అత్యంత ఎత్తైన హనుమాన్ విగ్రహాల్లో ఒకటి. అయితే, విగ్రహ ఏర్పాటు నుంచే కొందరు క్రిస్టియన్ కన్జర్వేటివ్‌లు దీనిని 'క్రైస్తవ వ్యతిరేకం' అని, 'దొంగ దేవుడు' అని విమర్శిస్తున్నారు.టెక్సాస్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఈ వివాదం ప్రాధాన్యం సంతరించుకుంది. వలసలు, సాంస్కృతిక గుర్తింపు వంటి అంశాలపై జరుగుతున్న విస్తృత చర్చకు ఇది అద్దం పడుతోంది. టెక్సాస్‌లో భారతీయ-అమెరికన్ల జనాభా గణనీయంగా ఉండటం కూడా ఈ వివాదానికి రాజకీయ రంగు పులుముతోంది.ఈ వివాదంపై ఆలయ అధికారులు స్పందిస్తూ, ఈ విగ్రహం తమ ప్రైవేట్ ఆస్తిలో ఉందని, ఇది స్థానిక హిందూ సమాజం భక్తికి, ఐక్యతకు చిహ్నమని వారు వివరించారు.



## జూరాలకు నీళ్లివ్వండి కర్ణాటక సీఎంకు రేవంత్ ఫోన్

**మొదటిపేజీ తరువాయి -** నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కోరారు. మంగళవారం ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు.జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేఘా రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. కర్ణాటక సీఎంతో చర్చించాల్సిన అంశాలపై వారితో మాట్లాడారు.అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు బెంగళూరుకు





బయలుదేరారు. మంగళవారం రాత్రి 8 గంటలకు శివకుమార్‌తో భేటీ కానున్నారు. జూరాలకు నీరు ఇచ్చేందుకు సానుకూలంగా స్పందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పనున్నారు. ఐదు టీఎంసీల నీటిని ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేయాలని కోరనున్నారు. జూరాలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతులు ఇప్పటికే ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. బీజేపీ కూడా ఈ అంశంపై స్పందించింది. దీంతో జూరాల నీటి వ్యవహారం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

సీమకిరణం కర్నూలు నంద్యాల తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# పాఠశాల ముందు పందుల సంచారం..

# దుర్వాసనతో విద్యార్థులకు ఇబ్బందులు..

ఫాగింగ్ పొగ బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ప్రజల విజ్ఞప్తి...









**వెల్దుర్తి, సెప్టెంబర్ 22, (సీమకిరణం న్యూస్):** వెల్దుర్తి మండల కేంద్రంలోని, మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల (మెయిన్) పరిసరాల్లో పారిశుధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. పాఠశాల ముందు పందులు సంచరిస్తుండటంతో పాటు, కోడిగుడ్ల పెంకులు, ఇతర వ్యర్థాలను అక్కడే పడేయడంతో వాటిని తినేందుకు పందులు వస్తున్నాయని తెలిపారు. దీంతో పరిసరాల్లో దుర్వాసన వ్యాపిస్తోందని వాపోతున్నారు. పాఠశాలలో చిన్నారులు మధ్యాహ్న భోజనం చేయాల్సి ఉండగా, చుట్టుపక్కల నుంచి వస్తున్న దుర్వాసనతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపాటి వర్షం పడిన సమయంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని, విద్యార్థులతో పాటు అటుగా వెళ్లే ప్రజలు కూడా దుర్వాసనను భరించలేక ముక్కుకు గుడ్డలు పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ముందస్తు వర్షాలకు గమనించి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దోమలు, ఈగల నియంత్రణకు పాఠశాల పరిసరాలు, మరియు వార్డులో మురుగు నీరు నిలిచే ప్రాంతాల్లో ఫాగింగ్ పొగ బ్లీచింగ్ పౌడర్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుధ్య చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య లోపాల కారణంగా టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులపై ప్రజల్లో ఆందోళన నెలకొంటోందని తెలిపారు. ముఖ్యంగా మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల (మెయిన్ )చదువుతున్న చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. పాఠశాల ముందు పందుల సంచారాన్ని అరికట్టడంతో పాటు వ్యర్థాలను అక్కడ పడేయకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చిన్నపాటి వర్షానికే భరించలేని దుర్వాసన వస్తున్న పరిస్థితికి శాశ్వత పరిష్కారం చూపి, చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడాలని సంబంధిత అధికారులను ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కొండెక్కిన చికెన్, కోడి గుడ్ల ధరలు..

# సామాన్యులకు మరో షాక్..

# తెలుగు రాష్ట్రాల్లో కిలో చికెన్ ఎంతంటే..



చికెన్ ప్రియులకు షాకింగ్ న్యూస్. తెలుగు రాష్ట్రాల్లో ధరలు పెరగుతున్నాయి. చికెన్‌తో పాటు కోడిగ్రుడ్ల ధరలు కూడా ఎగబాకుతున్నాయి. త్వరలో దసరా పండుగ రానున్న క్రమంలో ధరలు పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నాయి. ఇప్పటికే ఉల్లి ధరలు పెరగ్గా.. ఇప్పుడు చికెన్, గ్రుడ్ల ధరలు కూడా పుంజుకుంటున్నాయి. నాన్ వెజ్ తినేవారికి బ్యాడ్ న్యూస్. చికెన్ ధరలు కొండెక్కుతున్నాయి. గత కొద్ది రోజుల క్రితం కిలో చికెన్ రూ.230కే లభించగా.. ఇప్పుడు మళ్లీ ఆకాశాన్నంటుతున్నాయి. ఆదివారం కావడంతో చికెన్ తినేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారు. అయితే పెరిగిన ధరలు సామాన్యులపై భారం పెంచుతోంది. శ్రావణం మాసం పూర్తయిన దగ్గర నుంచి ధరలు కొద్దికొద్దిగా పెరుగుతూ వస్తోన్నాయి. త్వరలో పండుగలు రానున్న క్రమంలో మళ్లీ పుంజుకుంటున్నాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. దసరా, దీపావళి వంటి పండగలు రానుండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ధరలు ఎలా ఉన్నాయనేది చూద్దాం.

**తెలుగు రాష్ట్రాల్లో కిలో చికెన్ ఎంతంటే..?**

-హైదరాబాద్‌లో కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.252 పలుకుతుండగా.. డ్రస్డ్ చికెన్ రూ.223, రిటైల్ లైవ్ బర్డ్ రూ.144, ఎక్స్ ఫారం లైవ్ బర్డ్ రూ.117కు లభిస్తున్నాయి.

-కరీంనగర్ జోన్‌లో కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ.252, డ్రస్డ్ స్కిన్ రూ.223, రిటైల్ లైవ్ బర్డ్ రూ.144, ఫారం దగ్గర లైవ్ బర్డ్ రూ.117 పలుకుతున్నాయి.

-విజయవాడ జోన్‌లో కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.266, డ్రస్డ్ చికెన్ రూ.236, ఫారం దగ్గర లైవ్ బర్డ్ రూ.125, రిటైల్ లైవ్ బర్డ్ రూ.152 వద్ద కొసాగుతున్నాయి.

**పెరిగిన కోడి గ్రుడ్ల ధరలు**

సామాన్యుడికి అందుబాటులో ఉండే కోడిగ్రుడ్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. చికెన్ ధరలతో పాటు వీటి ధరలు కూడా ఎగబాకాయి. విజయవాడలో 12 గ్రుడ్ల రిటైల్ ధర రూ.80గా ఉంది. హైదరాబాద్ జోన్‌లో 12 గ్రుడ్ల రిటైల్ ధర రూ.76గా ఉంది. మొన్నటివరకు 12 గ్రుడ్ల ధర రూ.70గా ఉండగా.. ఇప్పుడు మరింతగా పెరిగాయి. చికెన్, గ్రుడ్ల ధరలు రెండూ పెరగడం సామాన్యులకు షాక్‌గా చెప్పవచ్చు. మొన్నటివరకు కిలో చికెన్ రూ.230 వద్ద ఉండగా.. ఇప్పుడు రూ.250 నుంచి రూ.270 వద్ద పలుకుతున్నాయి. పండుగల సీజన్ రానున్న క్రమంలో ధరలు మరితం ఎగబాకనున్నాయని చెప్పవచ్చు. పౌల్ట్రీ ఉత్పత్తి, సరఫరా వ్యత్యాసాల కారణంగా వ్యాపారులు ధరలను పెంచారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగాయి. షుగర్, వంట నూనె, గ్యాస్ ధరలు పెరిగాయి. దీంతో పాటు గత కొంతకాలంగా ఉల్లి ఘాటెక్కిస్తోంది. కిలో ఉల్లి రూ.70 పలుకుతోంది. పాల ధరలు కూడా ఇటీవల పెరిగాయి. ఎల్‌నీనో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో పంట సాగు తగ్గింది. ధరలు పెరగడానికి ఇదే కారణమవుతోంది.

# ఇది కదా కావాల్సింది.. జియో, ఎయిర్‌టెల్,

# వీఐ యూజర్లకు బిగ్ గుడ్ న్యూస్.. ఇక తక్కువకే..




దేశంలోని కోట్ల మంది మొబైల్ యూజర్లకు ట్రాయ్ గుడ్ న్యూస్ తెలిపింది. అవసరం లేని ఇంటర్నెట్ డేటాను వినియోగదారులపై బలవంతంగా రుద్దుతూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న టెలికాం దిగ్గజాలకు కళ్లెం వేసింది. జియో, ఎయిర్‌టెల్, విఐ, బీఎస్ఎన్ఎల్ వంటి సంస్థలు కేవలం వాయిస్ కాల్స్, ఎస్సెమ్మెస్ సేవలకు ప్రత్యేకమైన తక్కువ ధర ప్లాన్లను తీసుకురావాలంటూ కీలక ఆదేశాలు ఇచ్చింది. మొబైల్ యూజర్లకు భారత టెలికాం నియంత్రణ సంస్థ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇంటర్నెట్ అవసరం లేకపోయినా డేటాతో కలిపి వచ్చే ఖరీదైన రీఛార్జ్ ప్యాకేజీలను తప్పనిసరిగా తీసుకోవాల్సిన దుస్థితికి చెక్ పెట్టేందుకు రంగంలోకి దిగింది. కేవలం వాయిస్ కాల్స్, ఎస్సెమ్మెస్ సేవలు మాత్రమే కోరుకునే వారి కోసం ప్రత్యేకమైన, చవకైన రీఛార్జ్ వోచర్లను అందుబాటులోకి తేవాలని టెలికాం ఆపరేటర్లను ఆదేశించింది. ప్రస్తుతం మొబైల్ రీఛార్జ్ చేయాలంటే డేటా, అన్‌లిమిటెడ్ కాలింగ్, ఎస్సెమ్మెస్‌లు అన్నీ కలిపి ఒకే ప్యాకేజీగా వస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు, వయోవృద్ధులు, సాధారణ ఫీచర్ ఫోన్లు వాడే వారు ఇంటర్నెట్ వాడకపోయినా భారీ మొత్తంలో డబ్బు వెచ్చించి ఫుల్ ప్యాక్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. నెలవారీ రీఛార్జుల కోసం కుటుంబ బడ్జెట్ తలకిందులవుతోందని, కేవలం మాట్లాడుకోవడానికి మాత్రమే ప్రత్యేకంగా ప్లాన్లు తీసుకురావాలనే డిమాండ్ వినియోగదారుల నుంచి చాలా కాలంగా వినిపిస్తోంది. ఈ సమస్యపై దృష్టి సారించిన ట్రాయ్, జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, బీఎస్ఎన్ఎల్ వంటి అన్ని ప్రధాన టెలికాం కంపెనీలు తమ ప్లాన్ల నిర్మాణాన్ని మార్చుకోవాలని స్పష్టం చేసింది. ఇకపై డేటాతో సంబంధం లేకుండా 30 రోజులు లేదా అంతకంటే తక్కువ వ్యాలిడిటీతో కూడిన ప్రత్యేక వాయిస్ కాలింగ్, ఎస్సెమ్మెస్ వోచర్లను కచ్చితంగా ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. దీనివల్ల వినియోగదారులపై అనవసర ఆర్థిక భారం తప్పనుంది. సులభంగా చెప్పాలంటే.. కేవలం ఫోన్ కాల్స్ మాత్రమే మాట్లాడుకునే వారిపై ఇంటర్నెట్ డేటాతో కూడిన ఖరీదైన రీఛార్జ్ ప్యాక్‌లను బలవంతంగా రుద్దకూడదన్నదే ట్రాయ్ తాజా ఆదేశాల ప్రధాన లక్ష్యం. దీని ద్వారా యూజర్లు తమ వాడకం, అవసరాలు, ఆర్థిక స్తోమతకు తగిన రీఛార్జ్ ప్లాన్‌ను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ లభిస్తుంది. అయితే ఈ కొత్త ప్లాన్ల ధరలు ఎంత ఉండనున్నాయి, టెలికాం కంపెనీలు మార్కెట్లోకి వీటిని ఎప్పటి నుంచి అమల్లోకి తెస్తాయనే పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి.

# మద్యం సేవించి వాహనం నడిపితే జైలే

ఎస్సై అనిల్ కుమార్




**ప్యాపిలి సెప్టెంబర్ 22 (సీమ కిరణం న్యూస్) :** ప్యాపిలి మండల జలదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో డోన్ కోర్టు కఠిన శిక్ష విధించింది. ప్యాపిలి మండలం మాధవరం గ్రామానికి చెందిన పి. సుధాకర్ నాయుడుకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్. నూరుల్లా తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని, జైలు శిక్షతో పాటు జరిమానాలు విధిస్తామని ఎస్ఐ అనిల్ కుమార్ హెచ్చరించారు.

# వెల్దుర్తిలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నూతన మండల కమిటీ ఎన్నిక




**వెల్దుర్తి, సెప్టెంబర్ 22, (సీమకిరణం న్యూస్):** వెల్దుర్తి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీ ఎన్నికతో పాటు కీలక సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వెల్దుర్తిలోని స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు, మాదిగ ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక ప్రాంగణం సమావేశ వేదిక వెల్దుర్తి పట్టణం చీఎ-44, హోసన్న మందిరం ఎదురుగా ఉన్న హోటల్ ప్రాంగణం. కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండలానికి చెందిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై నూతన మండల కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సన్నాహక సమావేశంలో సీనియర్ నాయకులు ఎం. బజార్ మాదిగ, ఎన్. గిడ్డయ్య మాదిగ, జే. బజార్ మాదిగ, సూర్యచంద్ర మాదిగ, ఎల్లస్వామి, బ్రహ్మం, సుధీర్, కొండ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి




**ప్యాపిలి, సెప్టెంబర్ 22 (సీమ కిరణం న్యూస్) :** ప్యాపిలి మండలం కలచట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మజరా గ్రామం నల్లబల్లి సుంకులమ్మ దేవాలయం వద్ద మౌలిక వసతులు లేవని ఎర్రగుంట్లపల్లికి చెందిన బత్తుల రమేష్ రెడ్డి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దృష్టికి తేవడంతో ఎమ్మెల్యే మంగళవారం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వారం వేలాది మంది భక్తులు సుంకులమ్మ అమ్మవారి దర్శనానికి వస్తారని, ఇక్కడ నిరంతరం రద్దీగా ఉంటుందని, అందువల్ల భక్తులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని, త్వరలో కాలువలు, తాగునీరు, వీధి దీపాలు తదితర సౌకర్యాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాంత సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి షాకింగ్ న్యూస్.. వారం రోజుల్లోనే.. కాస్త ఆగాల్సిందే..



బంగారం ధరలు గత వారం రోజుల్లో భారీ పెరుగుదలను నమోదు చేశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల ప్రభావం దేశీయ బులియన్ మార్కెట్‌పై పడుతోంది. దీంతో దేశంలో కూడా పసిడి ధరలు పుంజుకుంటున్నాయి. గత వారంలో రోజుల్లో భారీగా పెరిగాయి. ఎంత పెరిగాయంటే..?

గత వారం రోజుల్లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. గత కొద్ది నెలలుగా తగ్గుతూ వస్తోండగా.. గత వారంలో భారీగా పెరిగాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ గత వారంలో వడ్డీ రేట్లను పెంచడంతో పాటు భారత్‌తో పాటు రష్యా నుంచి చమురు ఎక్కువగా కొనుగోలు చేసే ఐదు దేశాలపై 100 శాతం దిగుమతి సుంకాలు విధించే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకతం చేశారు. ముడి చమురు ధరలు పడిపోవడం, డాలర్ బలపడటం వంటి పరిణామాలతో వారం రోజుల్లో పసిడి ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకున్నాయి. బంగారంతో పాటు వెండి ధరలు కూడా అమాంతం పెరుగుదలను నమోదు చేశాయి. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి ధరల ఎగబాకడానికి కారణమవుతున్నాయి. వారం రోజుల్లో బంగారం, వెండి ధరలు పెరగడానికి కారణాలేంటి? అనేది ఇప్పుడు చూద్దాం.

**వారం రోజుల్లో ఎంత పెరిగాయంటే..?**

గత వారం సెప్టెంబర్ 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బంగారం ధరలు పెరిగాయి. సెప్టెంబర్ 13న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో రూ.1,41,700 వద్ద ప్రారంభమవ్వగా.. సెప్టెంబర్ 19 నాటికి రూ.1,42,850కి చేరుకుంది. వారం రోజుల్లో మొత్తం మీద రూ.1150 పెరిగినట్లయింది. 24 క్యారెట్ల విషయానికొస్తే సెప్టెంబర్ 13న రూ.1,54,850 వద్ద కొనసాగగా.. సెప్టెంబర్ 19కు రూ.1,55,840 వద్ద కొనసాగుతోంది. వారంలో రూ.990 పెరిగింది. చెన్నైలో సెప్టెంబర్ 13న 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,41,700గా ఉండగా.. 19వ తేదీ నాటికి రూ.1,42,850కి చేరుకుంది. అటు చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,580 నుంచి రూ.1,55,840కి పెరిగిందని చెప్పవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో సెప్టెంబర్ 13న 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,41,850 వద్ద ట్రేడవ్వగా.. సెప్టెంబర్ 19వ తేదీనికి రూ.1,43,000కి చేరుకున్నాయి. 24 క్యారెట్ల బంగారం రూ.1,54,730 నుంచి రూ.1,55,990కి పెరిగాయి.

**వెండి ధరలు ఎంత పెరిగాయంటే..?**

వెండి ధరలు కూడా వారం రోజుల్లో పుంజుకున్నాయి. సెప్టెంబర్ 13న హైదరాబాద్‌లో కేజీ సిల్వర్ రూ.2.50 లక్షల వద్ద ప్రారంభమవ్వగా.. సెప్టెంబర్ 19 నాటికి రూ.2.60 లక్షల వద్ద ట్రేడవుతున్నాయి. వారం రోజుల్లో రూ.10 వేల మేర పెరిగాయి. అయితే ట్రంప్ సుంకాల ప్రభావం, డాలర్ బలపడుతుండటం, క్రూడ్ ఆయిల్ ధరలు మళ్లీ దిగొస్తున్న తరుణంలో బంగారం ధరలు ఈ వారంలో ఎలా ఉంటాయనే చర్చ వ్యాపార వర్గాల్లో జరుగుతోంది. ధరలు ఇలాగే పెరుగుతాయా.. లేదా తగ్గుతాయా అనేది ఊహకందని ప్రశ్నగా మారింది. వచ్చే నెల నుంచి దసరా, దీపావళి వంటి పండుగలు వరుసగా వస్తున్నాయి. దీంతో బంగారం ధరలు ఎలా ఉంటాయనేది చూడాలి.

